క్లుప్తంగా

ప్రజా సమస్యలపై పోరుబాట

ఆత్మకూరురూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి సోమశిల రోడ్డు వరకు గుంతలతో నిండిన మెయిన రోడ్డును మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించి రోడ్డును విస్తరించాలని కోరారు. సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 14న ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే డీఆర్‌ఎంను కలిసిన ఎమ్మెల్యే



కావలి: విజయవాడ రైల్వే డివిజనల్ డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్‌ను కావలి ఎమ్మెల్యే డీవీకృష్ణారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కావలి నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, రైల్వే సమస్యలు, అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి: ఉదయగిరి డిపో పరిధిలో ఆర్టీసీ బస్సు సర్వీసులు, లాజిస్టిక్ సేవలకు సంబంధించి సూచనలు, సలహాలను స్వీకరించేందుకు గురువారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ప్రయాణికులు 99592 25095 నంబర్‌కు ఫోన్ చేసి విన్నవించాలని కోరారు.

పాఠశాలలో తనిఖీలు

ఉదయగిరి: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు. హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

సీతారామపురం: పండ్రంగిలో తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును బుధవారం నిర్వహించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

16న సోమశిలకు శృంగేరి పీఠాధిపతి

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయానికి శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతి ఈ నెల 16న రానున్నారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల సోమసుందరమూర్తి, విజయ్‌కుమార్ సోమవారం పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపనను ఆయన చేతుల మీదుగా చేపట్టనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

ఇసుక రీచ్ పరిశీలన

సోమశిల : అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులోని ఇసుకరీచ్, యార్డును మైనింగ్ రాయల్టీ అధికారిణి స్వాతి బుధవారం పరిశీలించారు. మీడియాలో వచ్చిన కథనాల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో రీచ్‌లో జరిగే అవకతవకలపై పరిశీలించినట్లు ఆమె తెలిపారు. సర్వేయర్ సురేష్, వీఆర్వో అశోక్, గ్రామ సర్వేయర్ అమానుల్లా, సిబ్బంది ఉన్నారు.

అల్లూరు ఏఓగా వెంకటేశ్వర్లు

అల్లూరు: మండల వ్యవసాయాధికారిగా ఆర్ వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వింజమూరు మండల విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఏఓగా ఉద్యోగోన్నతి పొంది అల్లూరుకు వచ్చారు.

పోక్సో కేసులో నిందితుల అరెస్ట్

కావలి: పట్టణంలోని కోఆపరేటీవ్‌కాలనీలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి నమోదైన పోక్సో కేసులోని నిందితులైన ప్రకాశం జిల్లా కొత్తపట్నానికి చెందిన నాయుడు గోపిరాజు, అయిల గోపీకృష్ణ అలియాస్ లక్కీను బుధవారం అరెస్ట్ చేసినట్లు రెండో పట్టణ సీఐ తెలిపారు. నిందితులు మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో కావలి బస్టాండ్‌లో ఉండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ఆత్మకూరురూరల్: అప్పారావుపాళెం, బట్టేపాడు రైతుసేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ రైతులకు భూసార పరీక్షలు,ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఏఓ కిషోర్‌బాబు,వీఏఏలు ఝాన్సీరాణి, అర్చన, వెటర్నరీ అసిస్టెంట్ రఫీ పాల్గొన్నారు.

దుత్తలూరు: భైరవరంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, జొన్న, మినుము పంటలు సాగు చేసుకోవాలని ఏఓ ఎస్ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. ఏఈఓ సుస్మిత, వీఏఏలు దినేష్, మణికంఠ పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు భరోసా

- ప్రత్యేకావసరాల పిల్లలకు అండగా భవిత కేంద్రాలు
- సుదూరంగా కేంద్రాలు.. వచ్చేందుకు ఇబ్బందులు
- అందుబాటులో కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం
- వేధిస్తున్న ఫిజియోథెరపిస్టుల కొరత



- ఈ చిన్నారి పేరు ఎస్ రాహుల్. ఏడేళ్లు కలిగిన ఈ చిన్నారి మెదడుకు పక్షవాతం. కేవలం హావభావాలతోనే తల్లిదండ్రులకు తనకు ఏమి కావా లో చెబుతాడు. ఎక్కువ సేపు పడుకునే ఉంటుంటాడు. కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు చిన్నారిని కావలిలోని భవిత సెంటర్‌కు ఉదయం తీసుకొచ్చి వదిలిపెట్టి, మళ్లీ సాయంత్రం వచ్చి తీసుకెళ్తుంటారు. ఇలాంటి ఎంతో మంది చిన్నారులకు భవిత కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.



కావలిలోని భవిత కేంద్రంలో చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని

కావలి : దివ్యాంగులు సమాజంలో వేసే ప్రతి అడుగుకు అంగవైకల్యం అడ్డుకారాదు. వారు మనోస్థైర్యంతో ముందుకెళ్లాలనే యోచనతో భవిత కేంద్రాలు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాయి. విద్య, స్పీచ్‌థెరపీ, తదితరాల్లో మెళకువలను నేర్పిస్తున్నాయి. పుట్టుకతో, చిన్నవయస్సులో వైకల్యం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి భరోసానిస్తున్నాయి. ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు విశిష్ట సేవలందిస్తూ అండగా నిలుస్తున్నాయి. ఎవరో ఒకరు తోడుంటే కానీ ఒక అడుగు కూడా వేయలేరు. ఒకటికి పదిసార్లు చెబితే కానీ అర్థం చేసుకోలేరు. సొంతగా కాలకృత్యాలూ తీర్చుకోలేరు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల పరిస్థితి ఇది. మరి వీళ్ల రోజువారీ జీవనం సాగేదెలా? తల్లిదండ్రులు వాళ్లనలా చూస్తూ బాధపడాల్సిందేనా..? ఈ ప్రశ్నలకు సమాధానంగానే... భవిత కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దివ్యాంగ చిన్నారులకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో వీటిని నెలకొల్పాయి ప్రభుత్వాలు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు ఇవెంతగానో తోడ్పడ్డాయి. తల్లిదండ్రులకూ భరోసా ఇచ్చాయి.

ఫిజియోథెరపిస్టుల కొరతతో..

జిల్లాలో మొత్తం 38 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 18 ఏళ్లలోపు కలిగిన 696 మంది దివ్యాంగులు సేవలు పొందుతున్నారు. అందులో కొందరు చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. అలాగే ఇళ్ల వద్ద తల్లిదండ్రుల అనుమతితోనూ మరికొందరు దివ్యాంగులకు ఫిజియోథెరపి చేస్తున్నారు. జిల్లాలో 38 మంది ఫిజియోథెరిపిస్టులను నియమించాల్సి ఉండగా, ప్రస్తుతం 8 మందితోనే సేవలు అందిస్తున్నారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపి క్యాంపు నిర్వహిస్తే వారికి రూ.1,050 ఫీజుగా ప్రభుత్వ చెల్లిస్తోంది. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ప్రస్తుతం ఉన్న వారు ఒత్తిడికి గురవుతూ సక్రమంగా సేవలను అందించలేకపోతున్నారు. దీంతో చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. శారీరక, మానసిక, వినికిడిలోపం, తదితర 21 రకాల వైకల్యాలకు సంబంధించి చిన్నారులకు భవిత కేంద్రాల్లో మెళకువలు నేర్పిస్తారు. పిల్లల అవసరాలను గుర్తించి చేతికర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు తదితర పరికరాలను అందించి వాటి సహాయంతో శిక్షణ ఇస్తుంటారు. చేతులు, కాళ్లు, కీళ్ల వంకర ఉన్న పిల్లలకు సర్వశిక్షా అభియాన్ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారు. వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ చేయిస్తుంటారు. నిత్యం శిక్షణ ద్వారా విద్య, స్పీచ్‌థెరపీ అందిస్తారు.

నాణ్యమైన బోధన

జిల్లాలోని 38 భవిత కేంద్రాలకు ఇద్దరు టీచర్లు చొప్పున 76 మంది సహిత విద్య ఉపాధ్యాయులను నియమించాల్సి ఉండగా, ప్రస్తుతం 73 మంది ఉన్నారు. మూడు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. వీరు పిల్లలకు చదువు చెప్పడమే కాకుండా, పిల్లల సమాచారాన్ని తెలుసుకుని వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు భవిత కేంద్రాలకు పంపితే చేకూరే ప్రయోజనాలను వివరించాల్సి ఉంటుంది. భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులు బడిబయట ఉండకుండా బడిలో చేర్పించడమే కాకుండా నివాసాల వద్ద కూడా విద్యను అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని రకాల వసతులు కల్పిస్తూ వారికి కావాల్సిన సామగ్రి, ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన ఐదేళ్ల పైబడి 18 ఏళ్ల లోపు పిల్లలకు సమగ్ర సర్వశిక్షా అభియాన్స్ ద్వారా భవిత కేంద్రాల్లో ప్రత్యేక మెళకువలు నేర్పుతున్నారు. వీరు సామాన్యుల్లాగే మెలిగేలా ఈ కేంద్రాల్లో తీర్చిదిద్దుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న భవిత కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అవసరమైన శిక్షణ ఇస్తున్నారు.డిజిటల్ విద్యా విధానంలో పాఠాలు బోధిస్తున్నారు. ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందించి ప్రత్యేక యాప్‌లతో సాంకేతిక విద్య బోధిస్తున్నారు. భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు సమీప పాఠశాల నుంచి మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. ప్రత్యేకావసరాల పిల్లలకు నెలకు రూ. 300 చొప్పున పది నెలలకు రూ.3వేలు అందజేస్తున్నారు. బాలికలకు ప్రతి నెలా రూ.200 అదనంగా చెల్లిస్తున్నారు. ఇంటి నుంచి బయటకు రాలేని వారికి గృహాధారిత విద్యలో భాగంగా నెలకు రూ.300 చొప్పున అందజేస్తున్నారు. దివ్యాంగ పింఛన్ రూ.6వేలు ఇస్తున్నారు.

ఉత్తీర్ణత మార్కుల కుదింపు

ప్రత్యేకావసరాల పిల్లలకు సంబంధించి ఉత్తీర్ణత మార్కులను సైతం ప్రభుత్వం కుదించింది. ఆరు నుంచి పదో తరగతి వరకు దివ్యాంగులకు వైకల్యాన్ని బట్టి మార్కులు, మరి కొంత మంది దివ్యాంగులకు నిబంధనల మేరకు మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లుగా ప్రభుత్వం జీఓ జారీ చేసింది. వార్షిక పరీక్షల్లో 21 రకాల విభాగాల్లో ఆరో తరగతి నుంచి పదోతరగతి దివ్యాంగ విద్యార్థులకు ఉత్తీర్ణత మార్కులు తగ్గించింది. మూగ, చెవిటి, అంధులు, మెడ సంబంధిత వ్యాధులు, బుద్ధిమాంద్యత, మస్తిష్క, పక్షవాతం, అంగవైకల్యం, వెన్నెముక సమస్యలు, గ్రహణ మొర్రి , గ్రహణ చీలిక, మరుగుజ్జు, తదితర సమస్యలు ఉన్న వారు పది మార్కులకే ఉత్తీర్ణత పొందేలా ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన వారు 20 మార్కులు సాధించాల్సి ఉండగా, కొన్ని విభాగాల్లోని సబ్జెక్టులు తగ్గించడం, ఇతర వసతులు కల్పించారు.

ఉత్సాహంగా ఉంటాడు



నాకు ముగ్గురు పిల్లలు. ఒక బిడ్డ శారీరక అంగవైకల్యంతో జన్మించాడు. ఆ బిడ్డను భవిత కేంద్రానికి పంపిస్తుంటే మిగిలిన పిల్లలతో కలిసి ఉత్సాహంగా ఉంటున్నాడు. ఏదైనా ఇబ్బంది అయి భవిత కేంద్రానికి తీసుకెళ్లని రోజు బిడ్డ దిగులుగా ఉంటున్నాడు. భవిత కేంద్రంలో టీచర్లు పిల్లలను చాలా చక్కగా చూసుకుంటున్నారు.

–కుమారి, విద్యార్థితల్లి

సద్వినియోగం చేసుకోవాలి



సాధారణ పిల్లల కన్నా ప్రత్యేకావసరాలు ఉన్న పిల్లలే చాలా చక్కగా మాట వింటారు. భవిత కేంద్రానికి వచ్చే చిన్నారులను ప్రేమతో దగ్గరకు తీసుకుని మనం ఏమి చెబితే అదే చేస్తారు. శ్రద్ధగా పాఠాలు వింటారు. తల్లిదండ్రులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కే మమత, ఉపాధ్యాయిని, భవిత కేంద్రం, కావలి



చిన్నారికి ఫిజియోథెరపీ అందిస్తున్న దృశ్యం



భవిత కేంద్రానికి రాలేని చిన్నారికి ఇంటివద్దే పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని

తాళ్లూరి రమణయ్యనాయుడుకు నివాళి



తాళ్లూరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రామిరెడ్డి



మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి: దగదర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తాళ్లూరి రమణయ్యనాయుడు భౌతికకాయాన్ని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం సందర్శించి నివాళులర్పించారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రమణయ్యనాయుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు బుధవారం దగదర్తికి తీసుకురాగా రామిరెడ్డి నివాళులర్పించి అంజలి ఘటించారు. తాళ్లూరు పాతతరం రాజకీయ నాయకుడు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పాటు సేవలందించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన కుమారుడు ప్రసాద్‌నాయుడు దగదర్తి ఎంపీపీగా, కోడలు స్వరూప జెడ్పీటీసీగా సేవలందిస్తున్నారు. రమణయ్య నాయుడు భౌతికకాయం దగదర్తికి తీసుకొచ్చిన విషయం తెలుసుకుని మండల ప్రజలతో పాటు పలువురు నాయకులు నివాళులర్పించేందుకు తరలివచ్చారు.

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శ

కావలి: పట్టణంలోని సంకులవారితోటకు చెందిన పాముకాటు వైద్యుడు మూలంరెడ్డి మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. హోమియో వైద్య విధానంలో పాము, తేలుకాటుకు ఉచితంగా వైద్యం అందించే మోహన్‌రెడ్డి మరణించిన విషయం తెలుసుకుని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

'వెలిగొండ'కు అరకొర నిధుల కేటాయింపుపై ఆందోళన



బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపడుతున్న సీపీఎం, రైతులు సంఘ నాయకులు

ఉదయగిరి: మెట్టప్రాంతమైన ఉదయగిరికి సాగునీరందించే వెలిగొండ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ మూడు జిల్లాల్లో ఐదులక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరందించే వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు మరో రూ.5 వేల కోట్లు అవసరం కాగా, బడ్జెట్‌లో రూ.394 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు నిలిచిపోగా, సీతారామసాగర్ ప్రాజెక్టు శిలాఫలకానికే పరిమితమైందన్నారు. వీటిని అరకొర నిధులతో ఎలా పూర్తిచేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య, స్థానిక రైతులు,కార్మికులు పాల్గొన్నారు.

కావలిలో భారీ వర్షం

కావలి: కావలి నియోజకవర్గంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం నుంచి ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం వేకువజాము నుంచి కుండపోతగా కురవడంతో కావలి పట్టణంతో పాటు అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లోని లోతట్టు ప్రాంతాల జలమయమయ్యాయి. కావలి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 500 ఎకరాల్లో నారుమడులు నీటమునిగినట్లు తెలిసింది.

ఆత్మకూరు/సంగం/చేజర్ల/ఏఎస్‌పేట: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండ్రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8 గంటల వరకు 211.1 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. చేజర్ల మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న పందలవాగు చప్టాపై ప్రవహించింది. దీంతో చేజర్ల– సంగం మార్గంలో కొంత సమయం రాకపోకలు నిలిచాయి. ఏఎస్‌పేటలోని బస్టాండ్ నుంచి సిండికేట్ బ్యాంకు వరకు మెయిన్ రోడ్డు పూర్తిగా జలమయమైంది. దీంతో వాహనచోదకులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఉదయగిరి: ఉదయగి నియోజకవర్గంలో మంగళ, బుధవారాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వింజమూరు, కొండాపురం, కలిగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో పొలాలు పదునెక్కే వాన పడినట్లు రైతులు తెలిపారు. తీర ప్రాంత మండలాల్లో భారీ వర్షం పడినా, మెట్టప్రాంతంలో పెద్ద వాన లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వానలతో మెట్ట పైర్లకు కొంతమేర ప్రయోజనం చేకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు. చెరువుల కింద వరి నాట్లు వేయాలంటే భారీ వర్షం పడాల్సి ఉంది. కొండాపురం మండలంలోని మిడతవాగు చప్టాపై ప్రవహించింది. దీంతో రెండు గంటల పాటు కొండాపురం– కావలి మార్గంలో రాకపోకలు నిలిచాయి. కలిగిరి మండలంలోని పొగాకు రైతులు నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.



బిట్రగుంట: కప్పరాళ్లతిప్పలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



చేజర్ల మండలంలో చప్టాపై ప్రవహిస్తున్న పందుల వాగు

నేటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

దుత్తలూరు: మండలంలోని గురువారం నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు దుత్తలూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్ తెలిపారు. మండలంలోని సోమలరేగడలో బుధవారం నిర్వహించిన కేన్సర్ స్క్రీనింగ్ నమూనా సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందికి సూచనలు చేశారు.ఎంఎల్‌హెచ్‌పీ జీ సరళ, ఏఎన్‌ఎం చంద్రావతి, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో గురువారం నుంచి ఇంటింటిని సందర్శించి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాలని వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. బుధవారం ఆమె ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలతో సమావేశమై సర్వేపై సూచనలు చేశారు. సర్వేను పక్కాగా చేపట్టాలని, కేన్సర్ లక్షణాలు ఉన్న గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

సంగం: అదుపుతప్పి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటన మండలంలోని దువ్వూరు వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. కర్నూలు నుంచి నెల్లూరుకు బయల్దేరిన ఆర్టీసీ బస్సును దువ్వూరు సమీపంలోని రెండో పెట్రోల్ బంక్ వద్ద ఆపేందుకు డ్రైవర్ యత్నించారు. అయితే బ్రేక్ ఫెయిలైంది. దీంతో డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించి బస్సును పక్కకు తిప్పడంతో రోడ్డు దాటి దూసుకెళ్లింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. 18 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సంగం సీఐ వేమారెడ్డి ఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో బస్సును బయటకు తీయించారు. ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు.

దుకాణంలో చోరీ

- రూ.1.5 లక్షల అపహరణ

కలిగిరి: కిరాణా దుకాణంలో చోరీ జరిగిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కలిగిరిలోని ప్రధాన రహదారిపై ఉన్న అంకమ్మ తల్లి జనరల్ స్టోర్స్‌ను నిర్వాహకుడు నర్రావుల పుల్లారెడ్డి రాత్రి మూసేసి ఇంటికెళ్లారు. బుధవారం ఉదయం వచ్చేసరికి షట్టర్ పగలగొట్టి ఉంది. క్యాష్ కౌంటర్‌లో రూ.1.5 లక్షల నగదు చోరీకి గురైందని గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుకాణాన్ని ఎస్సై ఉమాశంకర్ పరిశీలించారు. వేలి ముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

సీతారామపురం: స్థానిక ప్రభుత్వ లేఅవుట్‌లో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను ఉదయగిరి గృహ నిర్మాణశాఖ డీఈఈ పీరాన్ బుధవారం పరిశీలించారు. అనంతరం సిమెంట్‌గోదామును తనిఖీ చేశారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా



ఉదయగిరి: జిల్లాలో ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు రేంజ్‌ల పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా కాకుండా బేస్ క్యాంపులు, చెక్ పోస్టులతో నిరంతర నిఘా పెడుతున్నట్లు డీఎఫ్‌ఓ మహబూబ్ బాషా తెలిపారు. ఉదయగిరి రేంజ్ పరిధిలో బుధవారం పలు నర్సీలు, ప్లాంటేషన్ పనులు పరిశీలించారు. అనంతరం కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. అనంతరం విరువూరు, కనియంపాడు ప్లాంటేషన్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట రేంజర్ కుమార రాజా, ఇతర అధికారులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు బంగ్లా సెంటర్‌లో సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట తక్కెళ్లపాడు రైతులు బుధవారం నిరసన తెలిపారు. నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే ఇంత వరకు బాగు చేయలేదని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మెన్ లేకపోవడంతో వ్యవసాయానికి విద్యుత్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై ఏఈ నాగూర్‌వలిని వివరణ అడగ్గా, తాను ఇటీవల విధుల్లో చేరానని, త్వరలో అన్ని సమస్యలు పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.